క్లుప్తంగా

కేఎంసీ విద్యార్థిని ఘనత



డాక్టర్ ప్రియాంకను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ, వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): ఇటీవల కోయంబత్తూరులో జాతీయ స్థాయిలో నిర్వహించిన స్పూకాన్ సదస్సులో కర్నూలు మెడికల్ కాలేజీ పీడియాట్రిక్ సర్జరీ పీజీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని డాక్టర్ ప్రియాంక మొదటి బహుమతి సాధించారు. ఆమె 'ఏడాదిలోపు పిల్లల్లో కిడ్నీలో వచ్చే టీబీ' గురించి ఈ–పోస్టర్ ప్రదర్శించారు. ఈ మేరకు ఆమెను మంగళవారం తన ఛాంబర్‌లో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ, పీడియాట్రిక్ సర్జరీ హెచ్‌ఓడీ డాక్టర్ శివకుమార్ అభినందించారు. జాతీయ, రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తామని ఆమె తెలిపారు.

బాలుర హోమ్ ఆకస్మిక తనిఖీ



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ది

కర్నూలు: నగర శివారులోని బాలాజీ నగర్‌లో ఉన్న బాలుర పరిశీలన హోమ్‌ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ది, కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంగళవారం కార్యాలయానికి చేరుకుని సంబంధిత రిజిస్టర్లను పరిశీలించి అక్కడున్న పిల్లలతో మాట్లాడారు. బాలలకు సంబంధించిన చట్టాలను, ఉచిత న్యాయ సహాయం గురించి తెలియజేశారు. పిల్లల లీగల్ సర్వీసెస్ యాక్ట్ – 1987 ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందుటకు అర్హులని, ఎవరికైనా న్యాయవాదులు లేకుంటే తమ సంస్థ తరఫున ఉచిత న్యాయవాదిని నియమించి కేసులను పరిష్కరిస్తామని చెప్పారు. అబ్జర్వేషన్ హోమ్ సూపరింటెండెంట్ హుసేన్ బాషా, డిస్ట్రిక్ట్ ప్రొబేషనరీ ఆఫీసర్ దివాకర్, సీడబ్ల్యూసీ చైర్మన్ జుబేదా బేగం, జువైనల్ జస్టిస్ బోర్డు మెంబర్ సునీత మాధవి, సిబ్బంది పాల్గొన్నారు.


బస్టాండ్లలో మినరల్ వాటర్ ప్లాంట్లు



కర్నూలు బస్టాండ్‌లో మహిళా ప్రయాణికులతో మాట్లాడుతున్న ఎంపీ, జోనల్ చైర్మన్

కర్నూలు సిటీ: జిల్లాలోని ఏడు ఆర్టీసీ బస్టాండ్లలో ఎంపీ నిధులతో మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీ బి.నాగరాజు, ఆర్టీసీ కడప జోన్ చైర్మన్ పుల నాగరాజు తెలిపారు. మంగళవారం కర్నూలు ఆర్టీసీ బస్టాండ్ స్టేషన్ మేనేజర్ కార్యాలయంలో వారు మాట్లాడారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో ఉచిత బస్సు ప్రయాణం పథకంపై మహిళలను అడిగి తెలుసుకున్నారు. కేడీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు, ఆర్ఎం శ్రీనివాసులు, డిపో మేనేజర్లు, తదితరులు పాల్గొన్నారు.

దుండగులపై చర్యలు తీసుకోవాలి



అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరాకు వినతిపత్రం ఇస్తున్న కురువ సంఘం జిల్లా నాయకులు

కర్నూలు: ఆలూరు మండలం మనేకుర్తిలో కురువల ఆరాధ్య దైవం భక్త కనకదాసు విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కురువ సంఘం నాయకులు అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరాను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈనెల 10వ తేదీన రాత్రి కొందరు దుండగులు భక్త కనకదాసు విగ్రహాన్ని ధ్వంసం చేశారని, ఘటనపై విచారణ జరిపించి నిందితులపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కురువ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి, జిల్లా ఉపాధ్యక్షుడు పెద్దపాడు ధనుంజయ, కోశాధికారి కేసీ నాగన్న, తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



క్రీడాకారిణి పూజితను అభినందిస్తున్న డైరెక్టర్ రాజశేఖర్

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఈనెల 10వ తేదీన జరిగిన ఎస్‌జీఎఫ్ ఆర్చరీ పోటీల్లో మాంటిస్సోరికి చెందిన 8వ తరగతి విద్యార్థిని పూజిత ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. మంగళవారం పాఠశాలలోని తన చాంబర్‌లో డైరెక్టర్ రాజశేఖర్ విద్యార్థినిని అభినందించారు. ఆమె వచ్చే నెల 8, 9 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో పతకం సాధించాలని ఆకాంక్షించారు.

డీజేలతో గుండె దడేల్!

- తలుపులు, కిటికీలు అదురుతున్నాయి
- పెరిగిన డీజేల వాడకం
- అధిక శబ్దాలతో కాలుష్య కాటు
- గర్భిణులు, చిన్నారులు, వృద్ధులకు అనారోగ్యం
- పట్టించుకోని అధికారులు

కర్నూలు(హాస్పిటల్): శుభకార్యం ఎలాంటిదైనా సరే, ఉత్సవం ఏదైనా సరే ప్రస్తుతం డీజే శబ్దాలు ఉండాల్సిందే. డీజే సంగీతానికి దాని దగ్గర ఉండి ఉత్సాహంగా నృత్యం చేసే వారికి ఆనందంగా ఉంటుందేమో గానీ కొందరికీ అదే ప్రాణ సంకటంగా మారుతోంది. పలు ప్రాంతాల్లో డీజేల వద్ద నృత్యం చేస్తూ గుండె ఆగి చనిపోయారన్న వార్తలు ఇటీవల తరచూ చూస్తున్నాం. అంతేగాక దీనివల్ల శబ్దకాలుష్యం పెరగడంతో పాటు చెవిటి, గుండె సమస్యలు, మానసిక సమస్యలు కూడా వస్తున్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అయినా వీటి నియంత్రణకు అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు.

ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా డీజే సౌండ్ బాక్స్‌ల వినియోగం పెరిగిపోతోంది. వివాహం అనంతరం ఇంటికి నూతన దంపతులను తీసుకొచ్చే తరుణంలో చేసే ఊరేగింపు (మెర్వణి), రాజకీయ నాయకులకు స్వాగతం పలికేందుకు చేసే ఊరేగింపు, ఏదైనా పోటీలో గెలిచినప్పుడు చేసే ఊరేగింపు ఇలా ఒక్కటేమిటి ఆనందం వచ్చినప్పుడు చేసుకునే ఎలాంటి ఊరేగింపునకైనా డీజే బాక్స్‌లతో సంబరం ఉండాల్సిందే. ఈ సందర్భంగా డీజే సౌండ్ బాక్స్‌లు చేసే శబ్దాలకు యువత ఉత్సాహపు నృత్యాలతో ఆ ప్రాంతం మారుమ్రోగిపోవాల్సిందే. దీనివల్ల అధిక శబ్దకాలుష్యం వెలువడుతున్నా, హృద్రోగులు, సున్నిత మనస్సు గల వారు, పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నా ఎవ్వరికీ పట్టింపు ఉండదు. వారి ఆనందం వారిదేనన్న విధంగా పరిస్థితులు మారిపోయాయి. విపరీతమైన శబ్దాలతో ఊరేగే డీజే బాక్స్‌లు ప్రమాకరమని వైద్యులు చెబుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు.

వినాయక నిమజ్జనం సందర్భంగా నమోదైన శబ్ద కాలుష్యం	
ప్రాంతం	శబ్దకాలుష్యం (సగటు) డెసిబెల్లలో
కొండారెడ్డి బురుజు	110
రాజవిహార్	125
బుధవారపేట	135
కలెక్టరేట్	136
వినాయకఘాట్	110



డీజే సౌండ్ బాక్స్‌ల వాహనం

అధిక శబ్దాలు ఆరోగ్యానికి చేటు!

మనం రోడ్డుపై వెళుతుంటే పెద్దగా శబ్దాలు చేస్తూ వాహనాలు వెళ్తుంటే చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. అలాంటిది గంటల తరబడి రోడ్లపై డీజే శబ్దాలతో ఊరేగింపు సాగితే ఇంకెలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. కొందరు అర్ధరాత్రి వరకు డీజే శబ్దాలతో చేసే ఊరేగింపుతో ఎంతో మంది తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారు. డీజే శబ్దాలతో గుండె సమస్యలు, మానసిక సమస్యలు, వినికిడి లోపాలు, చిన్నారులు, వృద్ధుల ఆరోగ్యానికి ఇబ్బంది ఏర్పడుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వాహనాలకు సౌండ్ హారన్‌లను నియంత్రిస్తున్న అధికారులను డీజేలను ఎందుకు నియంత్రించలేకపోతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఇవీ మార్గదర్శకాలు

- బహిరంగ ప్రదేశాల్లో 10 డెసిబుల్స్‌కు మించి శబ్దం చేయరాదు.
- ప్రైవేటు ప్రదేశాలు (ఇల్లు, హాళ్లు)లో డీజే శబ్దాలు చేయరాదు.
- లిఖిత పూర్వక అనుమతి లేకుండా లౌడ్ స్పీకర్లు, సౌండ్ బాక్స్‌లు వాడకూడదు.
- నిషిద్ధ ప్రాంతాలుగా గుర్తించిన ప్రదేశాల్లో సంగీత ధ్వనులు, డ్రమ్స్ కొట్టడం, ఇతర శబ్దాలు చేయకూడదు.
- సినిమా థియేటర్లలో సైతం 65 డెసిబుల్స్‌కు మించి శబ్దం రాకూడదు.
- వైద్యశాలలు, విద్యా సంస్థలు, దేవాలయాలు, న్యాయ స్థానాలకు వంద మీటర్ల పరిధిలోని ప్రాంతాలను నిషిద్ధ ప్రాంతాలుగా పరిగణిస్తారు. ఇక్కడ శబ్దాలు చేయడంపై నిషేధం విధించారు.

గుండెపోటు వచ్చే అవకాశం



డీజే శబ్దాల వల్ల వృద్ధులు, ఇప్పటికే గుండె సమస్యలు ఉన్నవారికి అకస్మాత్తుగా గుండె పోటు వచ్చే ప్రమాదం ఉంది. సున్నిత మనసుకుల్లో మానసిక ఒత్తిడి మరింత పెరిగే అవకాశం ఏర్పడుతుంది. శబ్దాలకు గుండె జబ్బులతో బాధపడే వారు, గర్భిణులు, చిన్నారులు ఇబ్బందులు తీవ్ర పడతారు. సాధ్యమైనంత వరకు డీజే శబ్దాలు, అర్ధరాత్రి టపాసుల శబ్దాలు తగ్గించుకోవడం మేలు. **– డాక్టర్ పి.ప్రశాంత్, కార్డియాలజిస్టు, జీజీహెచ్, కర్నూలు**

మానసిక ఒత్తిడి మరింత పెరుగుతుంది



ఇటీవల కాలంలో డీజే శబ్దాల వాడకం పెరిగిపోయింది. మరికొందరు అర్ధరాత్రి సైతం డీజే శబ్దాలు, విపరీతమైన పేలుడు శబ్దాలతో టపాసులు పేలుస్తున్నారు. దీనివల్ల మానసిక ఒత్తిడి ఏర్పడుతుంది. బీపీ ఉన్న వారు, ప్రశాంతత కోసం ప్రార్థనలు చేసుకునే వారు ఇబ్బందులు పడతారు. కోపం, మానసిక ఒత్తిడి వల్ల గ్యాస్ట్రబుల్ పెరిగే అవకాశం ఉంది. ఇతరులకు ఇబ్బంది లేకుండా ఉత్సవాలు చేసుకోవాలి.

– సిరిగిరెడ్డి జయరెడ్డి, సైకాలజిస్టు, కర్నూలు

ఉల్లి నష్టాన్ని పకడ్బందీగా లెక్కించండి

కర్నూలు(సెంట్రల్): ముందస్తు ఖరీఫ్‌లో వర్షాలతో దెబ్బతిన్న ఉల్లి పంట నష్టాన్ని పకడ్బందీగా లెక్కించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం ఆమె ఆర్‌డీఓలు, తహసీల్దార్లు, వ్యవసాయాధికారులు, మండలాల ప్రత్యేకాధికారులతో విజయవాడ నుంచి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉల్లి నష్టాన్ని అంచనా వేయడంలో ఫిర్యాదులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నష్ట నివేదికతో పాటు వర్షపాత వివరాలతో ప్రభుత్వానికి నివేదించనున్నట్లు చెప్పారు. అలాగే ఉల్లి పక్వానికి రాక ముందే కోతలు చేపట్టరాదని, కనీసం 110 రోజుల పంటకాలం తరువాత కోతలు చేపట్టి బాగా ఆరబెట్టి, గ్రేడింగ్ చేసుకున్నాకే దిగుబడులను మార్కెట్ తేవాలని రైతులకు సూచించారు. టమాటపై నల్ల మచ్చలు వస్తున్నాయని, అందుకే మంచి ధర రావడం లేదని చెప్పారు. మొక్కల సంరక్షణలో వచ్చే తెగుళ్లపై వ్యవసాయ, హార్టికల్చర్ అధికారులు రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. ఉల్లి క్రాప్ బుకింగ్ శనివారంలోపు 100 శాతం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జేసీ డాక్టర్ బి.నవ్యకు సూచించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, హార్టికల్చర్ అధికారి రామాంజనేయులు పాల్గొన్నారు.

వెంకటస్వామి స్ఫూర్తితో ఉద్యమిద్దాం

కర్నూలు(సెంట్రల్): కేవీపీఎస్ న్యూసిటీ మాజీ ఉపాధ్యక్షుడు వెంకటస్వామి స్ఫూర్తితో అట్టడుగు వర్గాల అభివృద్ధి కోసం ఉద్యమిద్దామని ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఎండీ ఆనంద్‌బాబు పిలుపునిచ్చారు. మంగళవారం కర్నూలులోని శరీన్ నగర్‌లో ఉన్న వెంకటస్వామి నివాసంలో ఆయన రెండో వర్ధంతి కార్యక్రమం చేపట్టారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన సేవలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో ఆర్.పెద్దబాబు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో ఉల్లి, టమాటా రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఏపీ రైతు సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పి.రామచంద్రయ్య, రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం విమర్శించారు. మంగళవారం సీఆర్ భవన్‌లో ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అన్నదాతలు పండించిన దిగుబడులకు గిట్టుబాటు ధర కల్పించడంలో ముఖ్యమంత్రి విఫలమయ్యారని విమర్శించారు. ఉల్లికి ఇస్తామన్న రూ.1200 మద్దతు ధర ఇంతవరకు అందలేదన్నారు. మార్కెట్‌లో కిలో ఉల్లి రూపాయికి పడిపోయిందని, అలాగే టమాట ధరలు దారుణంగా పతనమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. 25 కేజీల టమాట బుట్ట రూ.25కు కూడా ఎవరూ కొనడం లేదన్నారు. అధికార యంత్రాంగం వైఫల్యమే ఇందుకు కారణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని, లేకుంటే తగిన మూల్యం తప్పదని హెచ్చరించారు. మరోవైపు ఖరీఫ్‌లో భారీ వర్షాలతో పంటలన్నీ దెబ్బతిన్నాయని, రైతులను ఆదుకునేందుకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు నాగేంద్రయ్య, రాజాసాహెబ్, తిమ్మయ్య, డి.శ్రీనివాసరావు, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పి.రామచంద్రయ్య

మిద్దెతోట పెంపకందారులకు బహుమతులు

కర్నూలు (టౌన్): నగరాన్ని పచ్చదనంతో తీర్చిదిద్దేందుకు స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా హరిత ఆంధ్ర అనే అంశంతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటి మేడపై, అపార్టుమెంట్ల బాల్కనీలలో పండ్లు, పూల మొక్కలు, కూరగాయాలు పెంచడాన్ని ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు తమ పేర్లను సంబంధిత సచివాలయాల శానిటేషన్ కార్యదర్శుల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. ఉత్తమ మిద్దెతోట పెంపకందారులకు బహుమతులు అందజేస్తామని వెల్లడించారు.

12వ పీఆర్‌సీ కమిషన్‌ను నియమించాలి

కర్నూలు(సెంట్రల్): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, వెంటనే 12వ పీఆర్‌సీ కమిషన్‌ను నియమించాలని ఏపీటీఎఫ్ డిమాండ్ చేసింది. మంగళవారం ఏపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదుట సాయంత్రం 6 గంటల సమయంలో నిరసన చేపట్టారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రవికుమార్ మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తున్న కూటమి ప్రభుత్వ తీరును ఖండిస్తున్నట్లు చెప్పారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 11 నుంచి 17వ తేదీ వరకు నిరసన ప్రదర్శనలు చేస్తున్నామని, అందులో భాగంగా ప్రస్తుతం కలెక్టరేట్ ఎదుట నిరసనకు దిగినట్లు చెప్పారు. తమ నిరసనలకు ప్రభుత్వం స్పందించకపోతే చలో విజయవాడకు పిలుపునిస్తామని చెప్పారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయాలన్నారు. ఈహెచ్ఎస్ పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలని, వివిధ రకాల యాప్‌లు, అసెస్‌మెంట్ బుక్‌లెట్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని, ప్రభుత్వం ఇచ్చిన మెమో నంబర్ 57ను రద్దు చేయాలని కోరారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, రంగన్న, నాయకులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దేందుకు చర్యలు



సమస్యలను తెలుసుకుంటున్న కమిషనర్ పి.విశ్వనాథ్

కర్నూలు (టౌన్): కర్నూలును స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అన్నారు. ఆయన మంగళవారం మున్సిపల్ అధికారులతో కలిసి స్థానిక సీతారాం నగర్, కొత్తపేట, అశోక్ నగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీటి సరఫరా, ఔటర్ రింగ్ రోడ్డు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, బహుళోపయోగ కమ్యూనిటీ హాలు, పచ్చదనం, పార్కుల అభివృద్ధి, క్రీడా మైదానాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్ రెడ్డి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, ఎంఈ మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

22 నుంచి దసరా నవరాత్రులు

కర్నూలు కల్చరల్: కర్నూలు ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో ఈనెల 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు దసరా నవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి పేర్కొన్నారు. ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రాలను ఆయనతో పాటు వెల్దుర్తి హనుమాన్ జంక్షన్ వ్యవస్థాపకులు రామాంజనేయులు, రామిరెడ్డి తాత సేవా సంస్థల అధ్యక్షుడు దాసరి రామచంద్రారెడ్డి వివిధ ధార్మిక సంస్థల ప్రతినిధులు ఆవిష్కరించారు. ఉత్సవాల్లో భాగంగా రోజూ ఉదయం సాయంత్రం ప్రత్యేక పూజలు, అమ్మవారికి రోజుకో అలంకారం, ధార్మిక ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.



ఆహ్వాన పత్రాలను ఆవిష్కరిస్తున్న ధార్మిక సంస్థల ప్రతినిధులు


రిజర్వేషన్లతో మహిళా సాధికారత

కర్నూలు కల్చరల్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లు రాజకీయాల్లో గేమ్ చేంజర్ అవుతుందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వినూషా రెడ్డి అన్నారు. మంగళవారం నెహ్రూనగర్‌లోని తన కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. ఐవీఎల్‌పీ పర్యటనకు తనను ఎంపిక చేసిన బీజేపీ జాతీయ, రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అమెరికాలో చరిత్ర పరిరక్షణకు ఎంతో ప్రాధాన్యత ఇస్తారని, మ్యూజియంలు, పార్లమెంట్, పాఠశాల పుస్తకాల ద్వారా చిన్న నాటి నుంచే చరిత్రను బోధిస్తారన్నారు. మహిళల రాజకీయ భాగస్వామ్యం విషయంలో అమెరికా ఇంకా వెనకబడి ఉందన్నారు. ఇప్పటివరకు అమెరికాలో ఒక మహిళా అధ్యక్షురాలు కూడా లేరన్నారు. భారత దేశం పట్ల ఇతర దేశాలకు మంచి అభిప్రాయం ఉందన్నారు. 2029 ఎన్నికల్లో చట్ట సభల్లో 40 శాతానికి పైగా మహిళలు ప్రాతినిధ్యం వహిస్తారన్న నమ్మకం ఉందన్నారు.



మాట్లాడుతున్న వినూషారెడ్డి

కేఎంసీ మైదానంలో ఆటలేవీ!



కేఎంసీ మైదానంలో ఏపుగా పెరిగిన గడ్డి

జాతీయ మెడికల్ కౌన్సిల్‌కు చూపేందుకు మాత్రమే కర్నూలు మెడికల్ కాలేజీ మైదానం ఉన్నట్లుంది. ఇక్కడ 1,250 మంది ఎంబీబీఎస్ విద్యార్థులు, 750 మంది పీజీ వైద్య విద్యార్థులు కలిపి మొత్తం 2 వేల మంది చదువుతున్నారు. వీరందరూ చదువు, వైద్య సేవలతో పాటు క్రీడలల్లోనూ రాణించేందుకు నేషనల్ మెడికల్ కౌన్సిల్ నిబంధనల మేరకు సువిశాలమైన మైదానాన్ని ఏర్పాటు చేశారు. ఈ మైదానాన్ని ఎవరూ ఆక్రమించుకోకుండా కాపాడుకుంటూ వస్తున్నారు. మైదానముంటే విద్యార్థుల ఆటలు ఉండాలి. వారి దేహదారుఢ్యాన్ని పెంచాలి. తద్వారా వారు చురుగ్గా ఉండి చదువులో మరింత ఉన్నతంగా రాణించేందుకు అవకాశం ఉంటుంది. కానీ కొన్ని నెలలుగా ఈ మైదానంలో క్రీడలే జరగడం లేదు. విద్యార్థులను కేవలం తరగతి గదులు, రోగుల సేవకే పరిమితం చేసినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒకప్పుడు ఈ మైదానంలోనే పూర్వ విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి పతకాలు, కప్పులు సాధించారు. మైదానం వినియోగంలో లేకపోవడంతో ఏపుగా గడ్డి, పిచ్చి మొక్కలు పెరిగాయి. అందులో విషపురుగులు సంచరిస్తున్నాయి. ఈ కారణంగా వాకర్స్ కూడా అటువైపు వెళ్లేందుకు జంకుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి క్రీడామైదానాన్ని సద్వినియోగం చేయాలని పలువురు కోరుతున్నారు.

– కర్నూలు(హాస్పిటల్)

యానిమేటర్ల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న యానిమేటర్లు

కర్నూలు(సెంట్రల్): యానిమేటర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీ వీఓఏ యానిమేటర్ల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుంటెప్ప, సుంకన్న, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలను పరిష్కరిస్తామని ఎన్నికల ముందు సీఎం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చి పట్టించుకోవడం లేదన్నారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట యానిమేటర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తక్షణమే కాల పరిమితితో ఇచ్చిన వీఓఏలకు సంబంధించిన జీఓను రద్దు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలను తక్షణమే ఇవ్వాలన్నారు. పాడైన మొబైల్స్ స్థానంలో 5జీ ఫోన్‌లు ఇవ్వాలని, ఆన్‌లైన్ విధుల నుంచి తప్పించాలని, తొలగించిన యానిమేటర్లను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకటస్వామి, మారెప్ప, రాజమ్మ, షబీరాబేగం, కల్యాణి పాల్గొన్నారు.

స్వీపర్లను విధుల్లోకి తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): కరోనా సమయంలో ఆర్టీసీలో తొలగించిన 11 మంది స్వీపర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ నగర అధ్యక్షుడు నగేష్, కోశాధికారి సాయిబాబా డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్టీసీ బస్టాండ్‌లో పర్యటించిన ఆర్టీసీ రాయలసీమ రీజియన్ చైర్మన్ పూల నాగరాజుకు వారు వినతిపత్రం ఇచ్చారు. కరోనాకు ముందు బస్టాండ్‌లో 43 మంది స్వీపర్లు పనిచేస్తుండగా కరోనా సమయంలో అందరినీ విధుల నంచి తొలగించారని, అయితే తరువాత తమ పోరాటాలతో 11 మందిని తప్పా మిగిలిన వారిని తీసుకున్నారని, వీరిని మాత్రం ఎందుకు తీసుకోవడం లేదో ఎవరూ చెప్పడం లేదన్నారు. నాయకులు దేవరాజు, నరసింహులు పాల్గొన్నారు.

ఏపీఎంఎస్ఐడీసీకి అధికారుల కొరత

- ఎస్‌ఈ, డీఈ, ఏఈ పోస్టులు ఖాళీ
- టెక్నికల్ అసిస్టెంట్లే ఇంజినీర్లు

కర్నూలు(హాస్పిటల్): ఏపీ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎంఎస్ఐడీసీ)కు అధికారులు కరువయ్యారు. ఆ శాఖ పరిధిలో జరిగే నిర్మాణ పనులను పర్యవేక్షించేవారు ఉండటం లేదు. కీలకమైన పోస్టులన్నీ ఖాళీగా ఉండటంతో టెక్నికల్ అసిస్టెంట్లే ఇంజినీరింగ్ అధికారులుగా పర్యవేక్షణ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ కార్పొరేషన్‌లో ఎస్‌ఈ, ఈఈ, ఇద్దరు డీఈలు, నలుగురు ఏఈలు ఉండాల్సి ఉంది. మూడు నెలల క్రితం ఎస్‌ఈ రమేష్‌రెడ్డి పదవీ విరమణ పొందారు. అదే సమయంలో రెండు వారాల ముందుగా వచ్చిన ఈఈ చిరంజీవులుకు ఎస్‌ఈ బాధ్యతలు ఇచ్చారు. ఈ కారణంగా ఈయన రాయలసీమ జిల్లాల పరిధిలో జరిగే నిర్మాణ పనులను పర్యవేక్షించాల్సి వస్తోంది. ఆయన మూడు రోజులు కర్నూలులో, మిగతా రోజులు ఆయా జిల్లాల్లో పర్యటించి పనులు పర్యవేక్షణ చేస్తున్నారు.

రెండు డీఈ పోస్టుల్లో ఒకటి, నాలుగు ఏఈ పోస్టుల్లో అన్నీ ఖాళీగా ఉన్నాయి. ఈ కారణంగా ఉమ్మడి జిల్లాలో జరిగే నిర్మాణ పనులను పర్యవేక్షించే వారే కరువయ్యారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాడు–నేడు, నాబార్డు పనుల్లో భాగంగా జరిగే పనుల కోసం నియమితులైన పది మంది టెక్నికల్ అసిస్టెంట్లు కర్నూలు, నంద్యాల, ఆదోనిలో జరిగే పనులను పర్యవేక్షించాల్సి వస్తోంది. ప్రస్తుతం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణం, పలు ఆపరేషన్ థియేటర్ల మరమ్మతులు, ఇతర నిర్వహణ పనులు జరుగుతున్నాయి. అధికారులు లేకపోవడంతో ఈ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ విషయమై సూపరింటెండెంట్‌కు, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈకి ఒకసారి వాగ్వాదం కూడా జరిగింది. పనులు ఆలస్యమవుతున్నాయని సూపరింటెండెంట్ ఏకంగా ఏపీఎంఎస్ఐడీసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో మాపైనే ఉన్నతాధికారులకు చెబుతారా అంటూ ఈఈ ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం విదితమే. అప్పటి నుంచి ఆయన ఆసుపత్రి పనులను పర్యవేక్షించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం జరుగుతున్న పనులన్నీ టెక్నికల్ అసిస్టెంట్లే చూడటంతో నిర్మాణ పనులు వేగం పుంజుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఆపరేషన్ థియేటర్ల పనులు పూర్తి కాకపోవడంతో వైద్యులు, వైద్య సిబ్బందితో పాటు ఆపరేషన్లు ఆలస్యం అవుతూ రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, ఏపీఎంఎస్ఐడీసీ రాష్ట్ర ఉన్నతాధికారులు స్పందించి ఖాళీగా ఉన్న పోస్టుల్లో అధికారులను నియమిస్తే సమస్య పరిష్కారమయ్యే అవకాశం ఉంది.



ఏపీఎంఎస్ఐడీసీ కార్యాలయం

విద్యార్థినులు సెల్‌ఫోన్‌తో జాగ్రత్తగా ఉండాలి



గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కర్నూలు(అర్బన్): ఆధునిక సాంకేతికతతో కూడిన సెల్‌ఫోన్లతో విద్యార్థినులు జాగ్రత్తగా ఉండాలని, ఈ విషయంలో తల్లిదండ్రులు తమ పిల్లలకు తగు సూచనలు ఇవ్వాలని డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శారద సూచించారు. మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి లీలా వెంకటశేషాద్రి ఆదేశాల మేరకు స్థానిక కలెక్టరేట్ సమీపంలోని ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహంలో 7, 8, 9వ తరగతి విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో లీగల్ సర్వీసెస్ యూనిట్ మెంబర్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, న్యాయవాది శ్రీలక్ష్మి, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ శైలజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీపీఓ శారద మాట్లాడుతూ.. అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలని, అనుమానం కలిగితే వెంటనే హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌కు సమాచారం అందించాలన్నారు. రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. పిల్లలు లైంగిక వేధింపులకు గురైనప్పుడు వెంటనే 1098 నంబర్‌ను సంప్రదించాలన్నారు. న్యాయవాది శ్రీలక్ష్మి మాట్లాడుతూ.. విద్యతో పాటు నైతిక విలువలు, సమాజం పట్ల అవగాహన కలిగేలా ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచనలు చేయాలన్నారు. హెచ్‌డబ్ల్యూఓ శైలజ మాట్లాడుతూ ప్రయాణాల్లో విద్యార్థినులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.